# అడివి మనిషి

రోడ్డుకు కుడిప్రక్కన నేరేడు చెట్టుకింద అంతాకలిసి పది మందున్నారు. చెట్టుకింద తాటికమ్మల చిన్న గుడిశె. గోడలైతే లేవు.... లోపల కట్టెల పొయ్యి, పొయ్యూదుతూ గడ్డపు సాయెబు. నాలుగైదు గాజుగ్లాసులు.... ఓ మంచి నీళ్లకుండ, పక్కన గిలేటుగ్లాసు పొయ్యిమీద గిలేటు పాత్రలో వానకాలపు వాగునీల్ల రంగులో ఉన్న చాయ్ మరుగుతోంది; బుగ్గలుబ్బించి ఊదుతూ సాయెబు మాటిమాటికి పొయ్యి చిదగ బొడుస్తున్నాడు.... బూడిద నెరుసులు గడ్డం నిండా, ఆ మాట కొస్తే, పొయ్యిమీది గిన్నెలో, గుడిసంతా పడుతున్నాయి. గుడిసె ముందు తెగిపోయిన గడంచలో ఓవ్యక్తి ముఖం మాడ్చుకొని కూర్చున్నాడు.... పిడికిలి మడచి బీడిమీద బీడితాగుతున్నాడు.... సాయెబు వేపుతొంగి చూస్తూ మాటి మాటికి "చాయ్" అని అరుస్తున్నాడు.

సాయెబు పిట్టలా నోరుతెరచి "వచ్చే....వచ్చే" నంటున్నాడు. అప్పటికి నాలుగు మార్లు వాళ్ళిద్దరు ఆ మాటలే అన్నారు. ఇంకా "చా" అయితే రాలేదు.....

ఇంతలో బాగా పొట్టిగా ఉన్న మనిషి గడంచలో కూర్చున్నతని ముందటికొచ్చి నిల్చున్నాడు....

"దండాల్ బాంచెన్.... ఎటోపోతండ్లు పటేలా ?"

గడంచలోని పటేల్ గడంచ కిర్రుమసంగ కదిలి దండంబెట్టిన వ్యక్తిని ఎగాదిగా చూసిండు.... దండం బెట్టినవ్యక్తి చాలా కురుచగా ఉన్నాడు. వయసెంతో చెప్పడం కష్టం.... నెత్తికి పాతపంచె రుమాలు. ముఖంలో ఎన్నెన్నో ముడుతలు. పాచిపండ్లు. కొంచెం పెరిగిన గడ్డం. గడ్డంలో అక్కడక్కడ నరిసిన వెంట్రుకలు. కళ్ళుపూరేడు పిట్ట కళ్ళలా చిన్నగాఉన్నా చాలా తేజ్‌గా ఉన్నాయి.... బనీనుతొడుక్కున్నాడు.... కావిరంగు దొడ్డుదోతి చిన్న చిన్న చిరుగులు కనిపించకుండా జాగ్రత్తగా

కట్టుకున్నాడు.... కళ్ళు కొంచెం పక్కలకు వంగిపోతున్నాయి....

మడిమెలు బాగా పగిలి, చాలా రోజులనుండి "గుర్రంమూతి" రోగంతో బాధపడుతున్నట్టుంది.... కాళ్ళకు ఉంగుటాల వంతుకు జనుప తాళ్ళు కట్టుకున్న చెప్పులు.... కాళ్ళ మీద చాలా దుమ్ము పేరుకపోయి. అతను చాలా దూరం నుండి నడిచి వచ్చినట్టుగా వున్నది.... పేరు వీరయ్య.

గడంచలోని వ్యక్తి ముడుచుకున్న ముఖాన్ని సాయెబు వేపు తిప్పి ఎదుటివ్యక్తిని ఖాతర్ చెయ్యకుండా మరో మారు "చాయ్" అన్నాడు.... ఇతడు నారాయణ.

"వచ్చే....వచ్చే...." మళ్ళీ అదేమాట....

వీరయ్య చాలా దూరం నుండి నడచి రావడంతోటి కాళ్ళు పీకుతున్నాయేమో దుమ్ములో కూలబడి పోయిండు. వీరయ్య నారాయణ నిర్లక్ష్యాన్ని గమనించనే లేదు.

"మోటరెప్పుడత్తది బాంచెన్....?"

సాయెబు గాజుగ్లాస్‌లో చాయ్ తెచ్చి నారాయణ కిచ్చాడు నారాయణ ఊదుకుంటూ తాగేసరికి ముఖం కొంచెం వికసించింది....

"బస్సెప్పుడత్తది బాంచెన్....?"

"పరమాత్మని కెరుక.... సవారాజ్జెమవ్వ- ఎవ్వన్ని ఏమనేటట్టున్నది? ఆనిట్టమచ్చినప్పుడు ఆడు తోలుకత్తడు...."

"తమరెక్కడిదాకా పోతండ్లు బాంచెన్....?"

"అల్లుకు బోతంటె పిల్లి ఎదురయినట్టు- ఏడికి బోతేండిరా?" నారాయణ కసురుకున్నాడు....

"నేను తాలుకాకు బోతున్న బాంచెన్.... పుట్టి- బుద్దెరిగిన కాన్నుంచి బస్సెక్కతే బాంచెన్...."

"ఓరినీయక్క! ఏ జంగల్ల బుట్టినవ్‌రా?"

వీరయ్య కొంచెం ముంగటికి జరిగిండు....

"అడవి మనుషులం బాంచెన్. ఎద్దుముడ్డి బొడుసుక బతికెటోల్లం నాగలి ఎలుగు నడుత్తందో, సలుగు నడుత్తందో ఎరిక బాంచెన్.... గీబస్సుల సంగతి మాకేమెరుక బాంచెన్....?"

"సరెగని ఎటో సానాదూరమే పోతున్నట్టున్నది....?"
నారాయణకు బస్సచ్చేదాక వీరయ్యతో బాతాఖానీ కొట్టబుద్ధయింది.

వీరయ్య రొండికున్న పొగాకు తీసి కొంచెం తుంచుకొని దవడ కేసుకున్నాడు....

"ఏం జెప్పాలె బాంచెన్....?" చెప్పాలావద్దాఅని కాసేపు విచారం చేశాడు వీరయ్య.

"జంగల్ల మనుషులకు అయి మూలలేమెరుక బాంచెన్.... పచ్చులసోంటోల్లం - పసురాలసోటోల్లం సెట్ల సంగతెరికే, సేమ సంగతెరికే కని మనుషుల సంగతే ఎరికైతలేదు బాంచెన్.... నేను ఎడ్లగాయంగ మానాయిన్న కాలం జేసిండు బాంచెన్.... గప్పుడు మాకు గుట్టకింద రెండుకురాలసర సెలుకుండె బాంచెన్....ఎప్పుడైనగ సెలుకల సువ్వలు, అయిందాలు తప్ప ఇంకేం బండతే బాంచెన్.... మానాయిన్న పాలుకు దున్ని పమ్మల సాదుకొచ్చిండు బాంచెన్.... అయ్యవ్వకు నేనొక్కన్నే కొడుకును బాంచెన్.... మాతాతకు మా నాయిన ఒక్కడే కొడుకు బాంచెన్ -మా అయ్య జచ్చినంక మా అవ్వ బొచ్చెకుగట్టుకొని సాదుకొచ్చింది బాంచెన్.... గది రాచ్చాసి బాంచెన్.... ఉపాసముప్ప దుండి కాకుల గద్దల గొట్టి గ సెలుక దక్కిచింది బాంచెన్ మా అవ్వ నేను మన్నుబుక్కి మన్నేర్గి- గసెలుకల రాళ్ళు రప్పలేరినం బాంచెన్.... మొట్లు మోరల్లు తవ్వేసినం.... గెట్లు బలిపిచ్చినం.... నాపెండ్లయి నేడు తెల్లొన్న బోత్తె- ఓనీ బాంచెనాతె సెప్పవశం గాదు

కడుముంత లంత కంకులు బెట్టినయ్‌బాంచెన్.... 'బిడ్డా! బూదేవర మసలనెత్తుకున్నదని' మా యవ్వ నన్ను అలాయి బలాయి దీసుకున్నది ఊరును మరిసి మాఅవ్వ నాపెండ్లాం నేను సేండ్లనే ఉండి పోయినం బాంచెన్.... పిట్ట ముట్టకుంట ఏదుగొట్ట కుంట అడవి పంది ఆసన బట్టకుంట కాపాడుకచ్చినం బాంచెన్....

అయితే ఆఖరుకేమయింది.... ఎనిమిది దినాలు అంచిన నడుమెత్తకుంట కోతలు గోత్తే సేనుకడుపు నంబలి బొయ్య దంగలేదుండ్లీ.... మెదమీన మెప. దీని కందులుగాల గూళ్ళేత్తె పక్నాల్గ గూళ్ళగుడి మెట్టు తీర్గ .... మా యవ్వ పిచ్చిదై పోయి గూళ్ళసుట్టు ఆసుబోసినట్టు తిరిగింది'' వీరయ్య గొంతు ఎందుకనో కొంచెం జీరగా విన్పించింది...

"గూళ్ళేసిన రెండోనాడు ఆడచ్చిండు బాంచెన్- ఆని కండ్లు దిరిగి పోయినాయ్. నా సేను బందుకు ఆని సేను పదిహేను ఎకరాలు ఉన్నది బాంచెన్. గదంత గొడితె పది గూళ్ళు బల్లే బాంచెన్.... ఆని కండ్లు సెవిరి బరాంచలే బాంచెన్.... మొఖం మాడ్చుకొని ఇంటికి బోయిండు బాంచెన్.... పోయినంక ఆని ఆరుబండ్లు పదిమంది పాలే రోల్లు, ఆడు, ఊళ్ళె పెద్ద మనుషులచ్చిండ్లు బాంచెన్.... గందట్ల పట్వారి సుత అచ్చిండు బాంచెన్.... మిల మిల సూడంగ సొప్ప బండ్లల్ల మెలుక్కున్నరు బాంచెన్....మాయవ్వ బండ్ల ముంగటికురికింది బాంచెన్ కనాలూడబీకింది బాంచెన్.... దాన్ని ఆడు గొట్టిండు బాంచెన్.... అది కోపమాసక మట్టి పెళ్ళలు ఇసిరింది బాంచెన్....దాన్ని నన్ను నా పెండ్లాన్ని మంచెగుంజలకుగట్టి సొప్ప మెలుక్క పోయిండు బాంచెన్....''

"చొ్చ.... చొ్చ'' నారాయణ చప్పరించాడు....

''ఆఖరుకు ఊళ్ళెకచ్చి ఆరంబడి జేత్తే తేలిందేందనుకున్నరు! గఘామి గాని నంబర్లున్నదట. మా అయ్యను ఉత్తగనే

దుస్కుకొమ్మన్నడట.... సరె ఎంటికలున్న కొప్పు ఎటు ముడిసినా సక్కంగనే ఉంటది. కోప్పడకుండ్లి బాంచెన్.... ఊరోల్లంత ఉనోని పట్టు దాసబోడు తాళ్ళపట్టయ్యింది.... మా అవ్వ మల్ల కోలుకోతే మట్టి పెళ్ళలు కొంగులేసుకొని తిరిగేది అది పిచ్చిదైపోయింది బాంచెన్ ... నా అనువం గిట్లనే ఉన్నదనుకొని కయికిలో కూలో సేసుక బతికిన బాంచెన్....నా పెండ్లాం నేను సెరోకయికిలి సేసు కొని కడుపుకు దినంగ యాభై రూపాయలు దాసినం బాంచెన్....

ఎప్పటిమాట! మా రామకిట్టు కడుపుల బడ్డప్పటిమాట. యాభై రూపాయలు కొంటబొయి పట్వారి సేతుల బోసిన బాంచెన్.... పట్వారి ఏకాల్లిలున్నడో నెమలి సెట్టు గుడ్డంసూపెట్టిండు బాంచెన్...ఏంజెప్పాలే బాంచెన్.... గగుడ్డంల అడవి పందులు పిల్లలుజేసినయ్ బాంచెన్ -గుడ్డం నిండా ఊడుగుకంప, పరికికంప, బలుసుకంప, కాలుబెట్ట సందు లేకుంటుండె బాంచెన్....గది కడుపుతో నున్నదని సుత సూడకుంట నీల్లు నిప్పులుదాగి సాపుజేసినం బాంచెన్.... గుండ్లుతవ్వి పారేసిన....''

"సరె! సరె! మల్ల సెలుక జేసుకున్నవ్.... పంట బాగా పండుతుందా?'' నారాయణకు మరింక వినబుద్ది కవడంలేదు....

"మా రామకిట్టు సచ్చినేడు బాంచెన్.... సేను....''

''సేను మా బాగున్నదంటవ్.''

"సరె బాంచెన్ గిదంతెందుకు గసేను సావుకర్సులకు, నా పెండ్లాం రోగంల బడితె ఇచ్చిన పైకానికి షావుకారి గుంజుకున్నడు బాంచెన్....''

''అయ్యయ్యో....'' నారాయణ కంఠంలో కొంచెం ఎగతాళి....

"అయ్యా! సేండ్లో సేండ్లని భూమో భూమని అంగలార్సిన. పుట్టిన నలుగురు పోరగండ్ల తీర్గనే రేవుకు దెచ్చుకున్న. సేండ్లు బోయిన

యనుకున్న.... సరెకట్టంల బుట్టికట్టంల బతికెటోల్లం గియ్యన్నిబోతె జనుకలే.... ఆఖరుకు మా మల్లి సచ్చిన్నాడు సుత నేను జనకలే.... కని బాంచెన్....'' వీరయ్య కంఠం పూడుక పోయింది....

"నీ బాంచెన్.... నాకట్టం సుకం జెప్పుకుంటున్న మన్నించుండ్లి సావంగా మిగిలినోడు మాసారయ్య ఆని కింకా మీసం కట్టే సరింగ మొలువలే బాంచెన్ .... బూములు సాపు జేసుకున్న- పెండ్లాం బోయినప్పుడు దానికి ఆకు సింపేసిండ్లను కున్న... నా అదురుట్టం గిట్లనే ఉన్నదని. కింది పెదవు మీనెత్తకుంట- కడుపుల దుఃఖాన్ని కడుపులేన్న ఉంచుకున్న.... నేను పుట్టి బుద్దెరిగిన కాన్నుంచి అసినిత్తని ఎవల్ని మాటనెరుగలే. నేను లంగను గాదు. లపంగను గాదు, దొంగనుగాదు. మాకొడుకు సారయ్య ఎడ్లు బూమి తప్ప మనుషులమర్మం ఎరికలేనోడు కడుపు కాలినోల్లు, బాంచెగాళ్ళు సంగాలు బెట్టిండ్లు.... అద్దుబిడ్డా! నువ్వెటుబోకు నీకు ఎనుకా ముందు ఏమెర్కలేదని ఎటుబోకుంట సూసుకుంటచ్చిన.... సంగాలచ్చినంక మావూళ్ళె పెద్దోల్ల నడుములు నక్కల కిరిగినయ్.... గకొట్లాటల తమరికేం జెప్పాలె బాంచెన్!.... ఊళ్ళె నుంచి పెద్దోల్లు ఎల్లిపోయి ఎములోల్ల దోలిచ్చిండ్లు. ఆళ్ళచ్చి ఎర్రిలేసిన కుక్కలోలె కనిపిచ్చినోన్నల్లి కరిసిండ్లు బాంచెన్!.... గుడిసెలు కూలగొట్టిండ్లు. కుండలు పలుగ్గొట్టిండ్లు కోడిపిల్లల పట్టుక పోయిండ్లు- పడుసు ఆడి పోరగండ్ల పట్టుకపోయిండ్లు- మొగ పోరగండ్ల పట్టుక పోయిండ్లు బాంచెన్.... మాసారయ్యను సుత పట్టుక పోయిండ్లు బాంచెన్.... గిప్పుడు రెక్కలు దెగిన పచ్చితీర్గ ఒంటిగాన్నయిపోయిన బాంచెన్.... జంగల్ల బతికినోన్ని తాలూకాకు బోయి ఏదన్న సేయాలని పోతన్న బాంచెన్....'' వీరయ్య పీక్కపోయిన చెంపల మీదికుండా రెండు కన్నీటిబొట్లు.

నారాయణ ఎందుకనో మళ్ళీ ముఖం మాడ్చుకున్నాడు.... సాయెబు గుడిసెలోపల ఏదో కూనిరాగం తీస్తున్నాడు.... ఆపాట విన్నతరువాత నారాయణ ముఖం ఇంకింత ముడుచుక పోయింది.

వీరయ్య లేచి రోడ్డుమీద కొంత దూరం తూర్పుగా నడచి నేరేడుచెట్టు నీడపడని చోటునుండి ఎడం చెయ్యి నుదురు కడ్డం బెట్టుకొని సూర్యున్ని చూశాడు.... ఏదో గొణుగుతు మళ్ళీ వెనక్కి వచ్చాడు.... నేరడు చెట్టు మొదట్లో కునికిపాట్లు పడుతున్న ముసలమ్మ దగ్గర కూర్చున్నాడు.

ముసలమ్మకు కొంచెం దూరంలో ముసలమ్మ మనుమడు, అతని భార్య ఏదో చెప్పుకొని నవ్వుతున్నారు....

"ఏవూరు బోతున్నవే ముసలవ్వ!"

ముసలమ్మ కళ్ళు తెరచి వీరయ్యను చూసింది. రవికలోనుండి నశ్యం డబ్బాతీసి నశ్యం ఎగబీల్చింది. దాని ముక్కుకు నశ్యం రెండు వేపులా అంటిఉన్నది....

"నా మనుమడు తీసుకపోతండు బిడ్డా! ఆడు దచ్చన్న రాజ్జేన కొలువు జేత్తండు. కాలం మంచిగ రాలే కొడుకా! కాలేర్ల మీనికి ఎగబడిపోతండ్లు"....ముసలవ్వ దవడలు తాకులాడు తుండగా, చెవులకు నూలు దారంతో కట్టుకున్న సెవుకాయలు ఊగుతుండగా చాలాచెప్పింది....

"నేను తాలుకా కు బోతన్న, పుట్టిబుద్దెరిగినకాన్నుంచి..." ముసలవ్వ ఊకొడుతుండగా మళ్ళీ మొత్తం కతంతా చెప్పుకొచ్చాడు వీరయ్య. ముసలవ్వ మధ్య మధ్య కళ్ళొత్తుకుంటు తిడుతూ విన్నది....

"కట్టం పుటుకే కొడుకా నీది.... ఆళ్ళకేం బొయ్యే కాలం దునియ పురాగ సెడిపోయింది బిడ్డ. బట్టగాల్సి మీనేసే కాలం.... నాకు సమధానం బిడ్డా! అడుతని నెత్తిబుడుతడు గొడితె బుడుతని నెత్తి బోడోడు

గొట్టిండట.... ఆళ్ళకు దగ్గ మిండెలు తయారయ్యేంటన్నమాట.... ఇగో ముసల్ది గిట్ల జెప్పిందని ఎనుక దిట్టినా మంచిదే.... ఊరంత ఒక్క టయినప్పుడు మనం గండ్ల కలువతె అచ్చేటిది గురుతు జేసుకొని తప్పించుకోవాలె- మనకు బురదడ్డమత్తె ఏం జేత్తం- బండేసుక దాటి పోతం....'' ముసలవ్వ ఇలాగా చాలా చాలా చెప్పింది.

వీరయ్య ఈసారి హోటల్ గుడిసె సాయెబు దగ్గరికి నడిచాడు. నోరు తెరచి ఏదో చెప్పబోయాడు....

"ముందుగాల గీ చాయ్ తాగు....'' సాయెబు....

"నాదగ్గెర....''

''ఊకెనే పోసిన, తాగు....''

వీరయ్య నమ్మలేనట్టుగా చూశాడు....

''మీది పోత్తారం గాదు....''

ఔనన్నట్లుగా తలూపాడు వీరయ్య....

"నాకంతెరికె- ముందుగాల చాయ్‌తాగు....''

"అంబలి దాగెటోన్ని గాదు....''

"చచ్చేంబోవు.... గట్లోనివే తాగు....''

తలరుమాలు ఊడదీక్కొని గ్లాసును పట్టుకొని ఊదుకుంటూ తాగాడు....

అంతలోకే.... బస్సువచ్చింది.

ఉన్న పదిమందిని బస్సులో కుక్కాడు కండక్టరు.... సాయెబు బస్సుదాకా వచ్చి...

"ఇగో ఈరయ్యన్నా! మునోసాబ్ కచ్చీరుకుబో అక్కన్నే అన్ని సంగతులు తెలుత్తయి....'' అని జెప్పాడు....

వీరయ్య చేతులు జోడించి సాయెబుకు దండంబెట్టాడు.... బస్సు

కదిలింది. సాయెబు మరల ఏదో పాట గొనుగుతూ గుడిసెవేపు నడిచాడు.

బస్సులోకూడా వీరయ్య అందరిని వాళ్ళ పేర్లు, ఊర్లుఅడిగి తెలుసుకున్నాడు. తనలాగ కనిపించిన ఒకరిద్దరికి, వాళ్ళడుగకున్నా, తన సంగతి చెప్పుకొచ్చాడు.... కొందరు "చ్చొచ్చొ....'' అన్నారు మరికొందరు "ఆయ్యయో,, అన్నారు.... వీరయ్య కెందుకో ఎందరికి చెప్పినా, ఎందరు సానుభూతి తెలిపినా, తృప్తి కలుగలేదు....

వీరయ్య తాలుకాలో బస్సుదిగి కోర్టుకు దారి అడుగుతూ కోర్టు చేరేసరికి కోర్టుముందు చాలామంది కనిపించారు.... చెట్లనీడకు కొందరు కునికిపాట్లు పడుతున్నారు, మరికొందరు ఏవేవో ముచ్చట్లు చెప్పుకుంటు న్నారు.... తన లాంటివాళ్ళు చాలమంది అక్కడ కూర్చుండటం చూచి వీరయ్య అశ్చర్యపడ్డాడు, తనలాంటివ్యక్తిని ఒకన్నిఅడిగి జడ్జికూర్చుందే గది తెలుసుకున్నాడు.

సరాసరి లోపలికి పోబోతున్న వీరయ్యను కోర్టుజవాను ఆపాడు

"సానా దూరం నుంచచ్చినయ్యా ! నాఒన్నొక్క కొడుకును పోలీసోల్లు పట్టుకచ్చిండ్లయ్యా!'', అంటూ రెండు చేతులు జోడించాడు

"అకీలును బెట్టుకోవాలె'' నని కసిరాడు....జవాను.

వీరయ్య చాలా సేపు బ్రతిమాలాడు, కోర్టుజవాను వీరయ్యను నెట్టుతూ "కొండయ్య హాజరే....''అని గట్టిగా మొత్తుకున్నాడు.

వీరయ్య చేసేదేమీలేక మళ్ళీ చెట్టుకిందికొచ్చాడు....మనసంత కోళ్ళు తవ్విన పెంటతీర్గుంది....కాసేపు అటిటూ తిరిగాడు.... ఇద్దరి ముగ్గురిని అడిగాడు....

మళ్ళీ కోర్టుజవానువేపు నడిచాడు....లోపలికి తొంగి చూసాడు.... బట్టతల గుమ్మడి పండులాంటి ముసలి మున్సొసాబ్ ఏదో అంటున్నాడు

జవాను మళ్ళీ వీరయ్యను వెనక్కినెట్టాడు....

వీరయ్యఅలా నాలుగైదుసార్లు తిరిగి విసిగిపోయాడు ... కోర్టు జవాను ఎందుకో అవతలి గదిలోనికి పోయాడు, వీరయ్య టక్కున లోపలికి నడిచాడు. చెక్క బల్లముందు కూర్చున్న నల్లకోట్ల వకీల్లు కొందరు ఆశ్చర్య పడ్డారు, కొందరు హేళనగా నవ్వారు....

వీరయ్య వాళ్ళను ఖాతరు చేయకుండా జడ్జీ ముంగటికి నడిచి రెండు చేతులెత్తి మొక్కాడు.

"నీ బాంచెన్ దొర ! సానా దూరం నుంచచ్చిన: జంగల్లబుట్టి నోన్ని. ఎందునెక్క లేనోన్ని :...."

"ఆడర్ .... ఆడర్ ...." జడ్జీ కర్రసుత్తితో బల్లమీదకొట్టుతూ....

వకీలు ఏదో చెప్పుతున్నాడు. వీరయ్య తొట్రుపడకుండ....

"నాలుగు పారీలు నేను కాస్తు జేసుకున్న బూములు గుంజుకున్నరు బాంచెను....ఆళ్ళపాపాన ఆళ్ళేపోతరని ఊకున్న బాంచెన్ మొన్న సంగపోల్లచ్చినంక నాబూమి నాకిచ్చిండ్లు బాంచెను....ఆఖరుకు దక్కిన ఇప్పగుడ్డం బాంచెన్....మాపూరి దొరదెంకపోయిండు బాంచెన్ పోలీసోల్ల తోలిచ్చిండు బాంచెను- ఊరునంత సత్తెనాశిడము జేసిండ్లు బాంచెను ... నాఆఖరుకొడుకు పసిపోరన్ని పట్కుకచ్చిండ్లు బాంచెను.... దరమ కుర్చిల కూకునోల్లు గి అన్యాయెం ఇసారం జేసి నాకొడుకును ఇడిపియ్యాలె బాంచెన్, కొండంత ఆశ బెట్టుకొని తమరి దగ్గరికచ్చిన బాంచెను" మళ్ళీ వంగి జడ్జికి మొక్కాడు

జడ్జి బెల్లు కొట్టాడు. జవాను పరుగెత్తు కొచ్చి వీరయ్యను పట్టుకొన్నాడు. వీరయ్య ఇంకా ఏదో చెప్పుతూనే ఉన్నాడు....

"ఇది కోర్టు! నువ్వు చెప్పేదంత పోలీసు స్టేషన్లో చెప్పుకోవాలె అర్థమయ్యిదా ?" నల్లకోటు వకీలు ఒకాయన....

"ఎక్కడి బాస్టర్డ్ వీడు ...." ఇంకో వకీలు....

"జంతువులాగున్నాడు...." ఇంకొక్క భారీకాయం లాయరు జవాను వీరయ్యను బరబర బయటకు ఈడ్చుకుపోయాడు....

వీరయ్య ముఖం ఎఱ్ఱబడింది కణతల దగ్గర నరాలు పొడుచు కొచ్చాయి కాసేపు చెట్టుకింద కూర్చుండి ఆలోచన చేశాడు. చివరకు లేచి అక్కడ నిలబడ్డ తెల్లబట్టలతన్ని పోలీస్టేషన్ దారడిగాడు.

వీరయ్య పోలీస్టేషన్లోనికి అడుగు బెట్టేసరికి డ్యూటిలో ఉన్న కానిస్టేబుల్ బూట్లు టక్ టక్ లాడించుకుంటూవచ్చి ,,గిదేడికి పటేలా అని హాస్యమాడాడు.

"అమీన్ దొరున్నడా బాంచెన్...."

"ఎందెంచ్చినవ్ ?...."

"నీ బాంచెన్.... నా కొడుకును...."

"నకురాల్ సెయ్యక్ నడూ...." కానిస్టేబుల్

"ఆనేదో !" లోపలినుండి-

పోలీసు తప్పుకునాడు....

వీరయ్య గద్దకండ్ల అమీనుకు వంగి వంగి దండం బెట్టాడు రుమాలు తీసుకొని రెండు చేతుల్లో పెట్టుకొని....

"అయ్యా ! బాంచెన్ - గరీబోల్ల ఓకంటసూడాలె బాంచెన్.... నా బూములు గుంజుకున్నరు.... నాకొడుకును...."

"బూములసంగతి గిక్కడగాదు. ఇగో, ఇటుచూడు,ఎడంచెయ్యి బాజు కన్పిత్తుందే గక్కడికినడూ! గక్కడ తాసీల్‌దారుంటడు, గక్కడ చెప్పుకో...."

వీరయ్య ఏంమట్లాడక ముందే కానిస్టేబుల్ మెడలమీద కఱ్ఱేసి బయటకు నడిపించు కొచ్చాడు....

వీరయ్య ఎడంసెయ్యివేపున తాసీల్ ఆఫీసుకు నడిచాడు.... అక్కడున్న జవాను చేతులో రెండురూపాయలు బెట్టికాళ్ళుమొక్కి కడుపుల తలబెట్టి గద్దువ బట్టుకొని, తాసీల్‌దారు ముందుకు నడిచాడు....

తాసీల్‌దారు సున్నగా నూనెబుడ్డీ తీరుగున్నాడు.

"అయ్యా! దరుమ దొరలు తమరన్న కలుగజేసుకోవాలె-బీదోల్లు మన్నయి పోతండ్లు బాంచెను....నాబూములు గుంజుకున్నరు...."

"నీ పట్టా బూములా?"

"పట్టానోకాదో నాకేమెరుక బాంచెన్....నేను కాస్తు జేత్తన్నంత పడింతరం పట్వారి దొరకు తాసీల్లు గట్టిన...."

"పోనీ, నీబూముల నంబర్లు గుర్తున్నయా?"

"నంబర్లేందో ఎరికలేదు బాంచెన్- నాపెండ్లయిన ఏడాది, మావూరి రాజేశ్వరరావు దొర నాకోసినసేను తననంబర్లున్నదని మెలుక్క పోయిండు బాంచెన్...."

"లాభంలేదు, పోలీసుస్టేషన్ల చెప్పుకపో!...."

"ఆడికి పోయిన బాంచెన్.... పోలీసాయినె ఈతలికి తరిమిండు బాంచెన్-అన్నాయెం బాంచెన్....నాకొడుకును పోలీసోల్లు పట్టుకచ్చిండ్లు బాంచెన్...."

"అయితే కోర్టుకుపో!...." మరింక మాట్లాడడానికి ఏమి లేదన్నట్టు బెల్ నొక్కాడు ఇందాక రెండు రూపాయలు తీసుకున్న జవాను వీరయ్యను బయటికి పట్టుక పోయాడు....

వీరయ్య తాసీలాఫీసు మెట్లుదిగి రావిచెట్టుకింద నిలబడి కాండ్ర కిచ్చి తాసీలాఫీసువేపు ఉమ్మేశాడు....

"లంగలు దొంగలు!...." గొణుక్కుంటూ కోర్టువేపు నడక సాగించాడు .... కోర్టుదగ్గరికి చేరేసరికి పొద్దు వంగిపోయింది.... చాలా మంది కోర్టుముందటున్న హోటల్ గుడిసెకాడచేరిపోయారు....

వీరయ్యకు కడుపులో ఎలుకలు తిరుగుతున్నాయి.

నోరెండుక పోయింది....ఏదన్న తింటే బావుండుననుకున్నాడు. కాని ఏది తినడానికి మనసొప్పలేదు .. హోటలతన్ని నీళ్లడిగితే, కసిరి గాజుగ్లాసులో నీళ్లిచ్చాడు. అవి ఏమూలకు సరిపోలే.... మరల అడగడం ఇష్టంలేక కొంచెము దూరంలో వున్న మర్రిచెట్టు మొదట్లో కూర్చు న్నాడు.... ఊడలు దిగిన మర్రిని చూస్తే, ఎందుకో అతనికి వాళ్ళ ఊరి రాజేశ్వర్‌రావు గుర్తుకొచ్చాడు.... వెనువెంటనే కొడుకు సారయ్య కండ్లల్లో మెదిలాడు. అతని కాళ్ళదగ్గర కుక్కొకటి ముంగటి కాళ్ళమీన తలబెట్టుకొని కునుకు తీస్తున్నది ...

"ఏంబతుకులు కుక్కబతుకులు....!" వీరయ్య గొణుగుతూనే మళ్ళీ కతంతా చెప్పుకొచ్చాడు. కుక్క విన్నదో లేదో తెలియదుగాని వీరయ్య గొణగడంతో లేచి అతని కాల్లు మూరికి చూసింది....

ఏంజేయాలో ఎంత ఆలోచించినా వీరయ్యకు అంతుబట్టడంలేదు. ఇంతలోకే బర్రున పోలీసు వ్యాను వచ్చి ఆగింది.... అందులో చాల మంది అరుస్తున్నారు....

"దున్నేవానికే భూమి దక్కాలి!"

"పోలీసు జులుం నశించాలి!"

వీరయ్య బెదిరిపోయి వ్యాను దగ్గరికి పరుగెత్తుకొచ్చాడు. ఆ అరు పులకు కోర్టు హాల్లోని లాయర్లంతా బయటకు వురికొచ్చి మెడలు రిక్కించి చూస్తున్నారు.... కాకి బట్టల అమీన్ లాఠీతిప్పుతూ ఏదో మొరుగుతున్నాడు.... అమీన్‌ను ఎవరు ఖాతరు చేయలేదు. హోటల్ దగ్గరి జనం వ్యానుచుట్టూ చేరి వింత చూస్తున్నారు....

ఆశ్చర్యంగా చూస్తున్న వీరయ్య దృష్టి వ్యానులో ఒకని మీద నిలిచిపోయింది....

''సారలీ!'' వీరయ్య ఆనందం పట్టలేక అరిచాడు.... కాని ఆ అరుపు వీరయ్యనే దాటలేదు....

వీరయ్య కొడుకు పెడీపెడీన నినాదాలిస్తున్నాడు. అందరు అందుకుంటున్నారు.... వీరయ్య పక్కకు నిలబడి నతనితో "ఆడు నా కొడుకే....'' అన్నాడు. పక్కతను పట్టించుకోలేదు.

ఇంతలో అక్కడికి తెల్ల పైజామా, చొక్కా వేసుకున్నతడు, నల్లకోటు లాయరు వచ్చారు వాళ్ళు నినాదాలాపి వ్యాను దిగారు.... వీరయ్య ముందుకు వచ్చాడు. సాంయ్య తన తండ్రిని చూసి చిన్నగా నవ్వాడు....కాని వీరయ్య నవ్వలేదు....సాంయ్య నెత్తికి కట్టుకట్టున్నది.... ఎవరికో తన తండ్రిని చూపించాడు. ఆ ఎవరో వీరయ్యకు నమస్కారం చేశాడు.... వీరయ్య తత్తర పడ్డాడు....

వీరయ్య నోరు తెరిచేసరికే, లాయరు ముందునడువగా ఏదో పాట పాడుతూ కోర్టుహాల్లోకి నడిచారు, అందరూ.

వీరయ్య కిటికీ చువ్వల్లో నుండి లోపలికి చూశాడు.... జడ్జి గుమ్మడిపండు ముఖం వాడిపోయింది.... గుడ్లు మిటకరిస్తూ ఏదో కీచు గొంతుతో అరుస్తున్నాడు. అప్పటికే జవాను రెండుసార్లు జడ్జికి మంచి నీళ్ళిచ్చాడు.... నల్లకోటు వకీలు జడ్జికి ఏవో కాయితాలందించాడు. జడ్జి కిందామీదాచూసి బరబర ఏదో గీకేశాడు....

అందరూ బయటకొచ్చారు. పోలీసువ్యాను ఖాళీగా వెలవెలపోయింది.... సారయ్య తండ్రిని కలుసుకున్నాడు. తండ్రిని తీసుకపోయి ఇందాకటి పైజామా అతనికి చూపించాడు.... అతను నమస్కారం చేశాడు....

"నీ కొడుకును బేల్ మీద విడిపించినం.... చాలా దూరంనుంచి చాలా కష్టపడి వచ్చారనుకుంటాను....''

"నాబూమి...." వీరయ్య తన దుఃఖాన్నంతా చెప్పుకొచ్చాడు.

ఇందాకటి మఱ్రిచెట్టుకిందికి తీసుకపోయి వీరయ్య చెప్పేదంతా ఓపికగా విన్నాడు....

"సూడు! ఈరన్న! మనకు మంచి రోజులొస్తాయి.... మన కష్టాలకు కారణాలు తెలుసుకున్నాం! నిలదీసి అడుగుతున్నాం.... వాళ్ళు కొండలాంటివాళ్ళే ఎనుకట మాగురువు ఒక చిన్న పిట్టకత చెప్పిండు.... ఓ ముసలోనికి కొండవతల మంచి బూమున్నదట. బూమి సాగుచేసుకోవాలంటే కొండెక్కి మళ్ళీదిగిపోవాలె.... ఎక్కేవరకే యాతన. ఇంకేంపనిజేత్తడు?.... అయితే ఈ ముసలయ్య ఒకనాడు కొండనే తవ్విపారేద్దామని పని మొదలు పెట్టాడట. ఆ దారంట పోతున్న ఒక పెద్దమనిషి విస్తుపోయి "ఒరే మూర్ఖుడా! గిదేం పనిరా!" అన్నడట. ముసలోడు నవ్వి "కొండను తవ్వుతున్నానన్నడట.... అతను నవ్వి.... "కొండను తవ్వే మూర్ఖున్ని నిన్నొక్కన్నే చూసిన, నువ్వు తవ్వితేనే కొండ అక్కడ లేకుంటయి పోతదా?" అన్నడట. ఆ ముసలయ్య "ఈ కొండను తవ్వంది నాకు బూమి పంటనియ్యదు.... గీకొండ ఉన్నంతే ఉంటదా? పెరుగుతదా? పెరుగది.... నేనుబోతే నా కొడుకు. నా కొడుకుబోతే నా మనుమడు నా మనుమడుబోతే.... ఎప్పటికైనా గీ కొండను తవ్వి పారేత్తం" అన్నడట.... ముసలయ్య పట్టుదలచూసి దేవుని మనసు కరిగింది. ఇద్దరు దేవదూతలను పంపినాడట. దేవదూతలు తమ రెక్కలమీద కొండనుతీసి బయట పారేశారట. నీకొడుకూ మేము ఆ ముసలాయనలాంటివాళ్ళం సంగపోళ్ళం. పార్టీవాళ్ళం. మాకు దేవుళ్ళంటే మీరే. మీరే మాకు దేవుళ్ళు. ఎప్పటికైనా మీ మనసు కరిగించగలిగితే మనం భూస్వాములను గెలువగలుతాం"

వీరయ్య అతిశ్రద్ధగా విన్నాడు అతని కెందుకో ఆనందం

పట్టరాకుండా ఉంది....

కాసేపు ఆమాట ఈమాట మాట్లాడి కొడుకు సారయ్యను తీసుకొని ఊరికి ప్రయాణమయ్యాడు....

మార్గంలో సారయ్యకు వీరయ్య ఈ విధంగా చెప్పాడు.

"ఒరే సారలీ! మనల్ని గొనేటోడెవ్వడులేడు, ఇన్నవా బిడ్డా? నువ్వు 'అద్దు మొర్రో' అన్నా. మళ్ళా పోలీసోల్లు పట్టుకత్తరు.... ఆళ్ళ దొర బంప్లే.... అట్టి గెందుకు దెబ్బలు బడాలె? అట్టిగబడ్డా పచ్చిగబడ్డా! నాకేదెర్కలే, నేను సచ్చువంతునన్నా, అందరితోని నిన్ను పట్టుకత్తరు.... సావంగ మిగిలినవ్ నువ్వొక్కనివి.... సంగపోల్ల ఇడువకు.... నేను కచ్చీర్ల జూసినగదా! మీరంతె అందరికి దప్పులు గొడ్తన్నయ్.... ఇయ్యాల్లరేపు దండం దాసెండ్లు బెడితె "బాంచోతు మాకలవుడా" అంటరు.... దుడ్డు బట్టినవో నీకేదండం బెడుతరు.... జెనుకకు.... మల్లెప్పుడు పోలీసోల్లకు దొరుకకు.... మనోల్లను మరువకు...."

ఇల్లు చేరుకునేదాక కనీసం పదిసార్లన్నా ఈ మాటలు చెప్పాడు వీరయ్య.... తండ్రి చెప్పిన మాటలకు తలూపాడు ... సారయ్య.

ఆరాత్రి వీరయ్య గొణుగుతూ పొగాకు నములుతూ, నిద్ర పోకుండా ఎక్కడెక్కడో తిరిగాడు.... "ముసలివాడు - కొండ కథ"ను ఇంకా బాగా ఎలా చెప్పాలో గునాయించుకున్నాడు....

—oOo—